క్లుప్తంగా

విద్యార్థులకు కంటి పరీక్షలు



విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్య నిపుణుడు మధుసూదన్‌రాజు

యాడికి: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సోమవారం తాడిపత్రి నియోజకవర్గ కంటి వైద్య నిపుణుడు మధుసూదన్‌రాజు ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. 27 మంది విద్యార్థులకు కంటి అద్దాలు అవసరమని గుర్తించి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నాగన్న, ఉపాధ్యాయులు ఇంతియాజ్ బాషా, రామలీల పాల్గొన్నారు.

తొమ్మిది మంది బైండోవర్

యల్లనూరు: నీర్జాంపల్లి, యల్లనూరుకుచెందిన తొమ్మిది మంది వ్యక్తులను సోమవారం తహసీల్దారు నాగరాజు సమక్షంలో బైండోవర్ వరు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ జీవన విధానంలో మార్పు రావాలన్నారు. గొడవలకు దిగితే రూ.లక్ష జరిమానా విధిస్తామన్నారు. మన స్పర్థలుంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్వేత, కానిస్టేబుళ్లు రవీంద్రారెడ్డి, నవీన్, జయానాయక్ పాల్గొన్నారు.

భజరంగ్‌దళ్ కోకన్వీనర్‌గా రవి



గుంతకల్లుటౌన్: భజరంగ్‌దళ్ రాష్ట్ర కోకన్వీనర్‌గా కసాపురానికి చెందిన సి.రవి నియమితులయ్యారు. రెండు రోజుల క్రితం తిరుపతిలో జరిగిన వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ రాష్ట్ర స్థాయి సమావేశాల్లో తనకు ఈ బాధ్యతలు అప్పగించినట్లు ఆయన సోమవారం ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు.హిందూ ధర్మపరిరక్షణ, గోరక్షణ కోసం కృషి చేస్తానన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

యాడికి: మండలంలోని పుప్పాల పంచాయతీలోని ఉన్న పుప్పాల తండా ప్రాథమిక పాఠశాల వద్ద మంగళవారం ఉదయం 9 గంటలకు జిల్లా న్యాయ సేవా సదనం, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, గిరిజన శాఖ సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సావిత్రి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి అధికారులు తప్పక హాజరుకావాలన్నారు. వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం



కాశేపల్లిలో మాట్లాడుతున్న తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి

పెద్దవడుగూరు: మండలంలో సమస్యల పరిష్కారమే లక్ష్యమని తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కాశేపల్లి, గుత్తిఅనంతపురం గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటానన్నారు. అయితే గుత్తిఅనంతపురం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో అధికారులకు వేసిన కుర్చీలను టీడీపీ కార్యకర్తలు ఆక్రమించడంతో ఎంఈఓలు రాముడు, గురుప్రసాద్ నిలబడాల్సి వచ్చింది. ఈ సంఘటన చూసి ప్రజలు నివ్వెరపోయారు. టీడీపీ హయాలో అధికారులకు గుర్తింపు ఇవ్వడం లేదని వాపోయారు.

ఎస్సీ బాలికల హాస్టల్ ఏర్పాటు చేయాలి



ఏఎస్‌డబ్ల్యూఓకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

గుత్తి: గుత్తిలోఎస్సీ బాలికల కళాశాల హాస్టల్ ఏర్పాటు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు సోమవారం ఏఎస్‌డబ్ల్యూఓ రాధికకు వినతిపత్రం అందజేశారు. ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు రమేష్ మాట్లాడుతూ ఎస్సీ బాలికల కళాశాల హాస్టల్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు రవీంద్ర, నవీన్, బాలు పాల్గొన్నారు.

కొత్త ఆలోచనలతో ముందుకు సాగాలి

గుంతకల్లు: విద్యార్థులు కొత్త ఆలోచన విధానంతో ముందుకు సాగాలని వక్తలు పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని శంకరనంద గిరి స్వామి డిగ్రీ కళాశాలలో జీవ సాంకేతిక శాస్త్రం, బయోటెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు సైన్స్ ఫెయిర్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ప్రిన్సిపాల్ గోపాల్ మాట్లాడుతూ సైన్స్ ఫెయిర్ ద్వారా విద్యార్థులో దాగి ఉన్న సృజనాత్మకతను బయటకు తీయవచ్చన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఆర్.సురేష్‌బాబు, బయోటెక్నాలజీ విభాగం అధ్యాపకులు ఖాజావలి, అధ్యాపకులు డాక్టర్ వైశాలి, వరలక్ష్మీ, ప్రజా సంబంధాల అధికారి బసెట్టి క్రిష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఎన్నికల సందడి

- ఈ నెల 8న స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు
- విద్యాకమిటీలో సభ్యులకు రెండేళ్ల పదవీకాలం



గార్లదిన్నె: ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్‌ఎంసీ) ఎన్నికలు సందడి ప్రారంభమైంది. స్కూల్ కమిటీల పేరుతో ప్రభుత్వం సూచన మేరకు జిల్లా మండల విద్యాశాఖ అధికారులు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు.ఈమేరకు ఓటర్లు జాబితాను విద్యాశాఖ అధికారులు ప్రకటించారు. ఈ నెల 8న శింగనమల నియోజకవర్గంలోని 281 ప్రభుత్వ పాఠశాలలు, గుంతకల్లు నియోజకవర్గంలో 203, తాడిపత్రి నియోజకవర్గంలో 223 పాఠశాలల్లో ఎస్‌ఎంసీ ఎన్నికలు నిర్వహించనున్నారు.

ఎన్నికల నిర్వహణ ఇలా..

పాఠశాలలో సెక్షన్లు , మీడియంతో సంబంధం లేకుండా తరగతి యూనిట్‌గా ముగ్గురు సభ్యులను ఎన్నుకోవాలి. వీరిలో కనీసం ఇద్దరు మహిళలు, ముగ్గురిలో ఒకరు తప్ప కుండా ఎస్సీ,ఎ స్టీ ,విభిన్న ప్రతిభావంతులు, మరొకరు బీసీ, ఈబీసీ, మైనార్టీకి చెందిన వ్యక్తి అయి ఉండాలి. తరగతి నుంచి సభ్యుల ఎన్నికకు 50 శాతం ఓటర్లు హాజరును రిజిస్టర్‌లో చూపిన తర్వాతనే ఎన్నిక జరపాలి. అలాగే చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికకు కూడా 50 శాతం సభ్యులు హాజరు ఉండాలి. క్లాసుల వారిగా ఎన్నికైన సభ్యులందరూ స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులుగా ఉంటారు. వారంతా కలసి కమిటీ వైస్ చైర్మన్‌ను ఎన్నుకుంటారు. అదేవిధంగా తరగతిలో కనీసం ఆరు మంది విద్యార్థులు లేక పోతే మరో తరగతిలోకి విలీనం చేసి ఎన్నుకోవాలి.

పరిశీలకులు వీరే..

స్కూల్ కమిటీ ఎన్నికల్లో ప్రధానోపాధ్యాయులు ఎన్నికల అధికారిగా ఉంటారు. తహసీల్దార్, ఎంపీడీఓ, వీఆర్‌ఓలు ఎన్నిల పరిశీలకులుగా ఉంటారు. తల్లి, తండ్రి, పిల్ల లు సంరక్షకులుగా ఉన్న వారు ఓటర్లుగా ఉంటారు. సోమవారం ఓటరు జాబితాపై అభ్యంతరాలు పూర్తయ్యాయి. 8వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంటలోపు సభ్యులతోపాటు చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు నిర్వహిస్తారు. అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు కమిటీ తొలి సమావేశం నిర్వహించాలి. పాఠశాల విద్యా కమిటీలో ప్రతి సభ్యుడికీ రెండేళ్ల పదవీకాలం ఉంటుంది.

గత ప్రభుత్వంలో స్కూల్ కమిటీలకు పెద్దపీట

గత ప్రభుత్వంలో స్కూల్ కమిటీ సభ్యులకు అధిక ప్రాధాన్యత ఇస్తూ నాడు-నేడు పనులు కమిటీ సభ్యులకే అప్పగించారు. దీంతో నాడు-నేడు పనులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జరిగాయి. ప్రతి నెలాసమావేశం నిర్వహించి, విద్యార్థుల పురోగతి, పాఠశాల అభివృద్ధి పనులపై సమీక్ష చేసి అందుకు అనుగుణంగా చర్యలు తీసుకునే వారు. ఈ ఏడాది ప్రభుత్వం మారడంతో కూటమి పార్టీల నాయకులు పాఠశాల ఎన్నికలపై దృష్టి సారించారు. టీడీపీకి చెందిన వారినే చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎన్నుకోవాలని ప్రయత్నాలు సాగుతున్నాయి. అలాగే క్షేత్రస్థాయిలో పట్టు సాధించేందుకు రాజకీయ పార్టీలకు పాఠశాల ఎన్నికలు వేదిక కావడంతో వైఎస్సార్ పార్టీ నాయకులు కూడా గట్టిగా ప్రయత్నాలు చేస్తున్నారు. పాఠశాల ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు దృష్టి సారించారు.

వివరాలు ఇలా..

నియోజకవర్గం	పాఠశాలల సంఖ్య
తాడిపత్రి	223
గుంతకల్లు	203
శింగనమల	281

పారదర్శకంగా ఎస్‌ఎంసీ ఎన్నికలు



మండల వ్యాప్తంగా 48 ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల 8న పాఠశాల స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం . ఇప్పటికే ఆయా గ్రామాల పాఠశాల నోటీస్ బోర్డులో ఓటరు జాబితా ప్రదర్శించాం. ఓటరు జాబితాపై అభ్యంతరాలు కూడా స్వీకరిస్తున్నాం.ఆయా గ్రామాల్లో విద్యార్థుల తల్లిదండ్రులు సమక్షంలో నిబంధనలు మేరకు పారదర్శకంగా ఎవరి ప్రమేయం లేకుండా స్కూల్ కమిటీ ఎన్నికలు నిర్వహిస్తాం.

– వెంకటరమణనాయక్, ఎంఈఓ, గార్లదిన్నె

రంగనాథుడి కల్యాణానికి ముహూర్తం ఖరారు



గ్రామస్తులకు లగ్నపత్రిక అందజేస్తున్న ఈఓ, అర్చకులు

గుత్తి రూరల్: మండలంలోని జక్కలచెరువు గ్రామంలో వెలసిన బొలికొండ రంగనాథ స్వామి కల్యాణాన్ని ఈ నెల 19న నిర్వహించేందుకు ముహూర్తం ఖరారు చేశారు. సోమవారం గ్రామంలోని రంగనాథ స్వామి ఆలయంలో ప్రత్యేకంగా పూజలు చేసి కల్యాణ లగ్నాన్ని నిర్ణయించారు. ఈఓ నాగేంద్రుడు, గ్రామ పెద్దలు, ప్రజలతో ఆలయంలో సమావేశం నిర్వహించి కల్యాణం నిర్వహించే తేదీలపై చర్చించారు. శ్రావణ పౌర్ణమి సందర్భంగా ఈ నెల 19న సోమవారం ఉదయం 11 నుంచి 12 లోపు దివ్య ముహూర్తం ఉండటంతో కల్యాణం జరిపించేలా లగ్నపత్రిక రాశారు. అర్చకులు, ఈఓ, ఆలయ కమిటీ సభ్యుల సమక్షంలో జక్కలచెరువు గ్రామ ప్రజల సమ్మతితో లగ్నపత్రిక ఖరారు చేశారు. లగ్నపత్రికను అర్చకులు సతీష్, రవికుమార్, లిఖిల్, కేతన్, విష్ణు తదితరులు జక్కలచెరువు గ్రామస్తులకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు లక్ష్మీనారాయణమ్మ, ప్రతాప్, నారాయణస్వామి పాల్గొన్నారు.

మహాధర్నా విజయవంతం చేయండి



మాట్లాడుతున్న వెంకట్‌నాయక్

గుంతకల్లు: ప్రభుత్వ హాస్టళ్లలో సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కలెక్టరేట్ వద్ద చేపట్టిన మహాధర్నాను విజయవంతం చేయాలని ఏఐఎస్‌ఎఫ్ నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు వినోద్‌కుమార్, ఆర్.వెంకట్‌నాయక్ కోరారు. సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ గత నెల 20 నుంచి 30వ తేదీ వరకు ప్రభుత్వ హాస్టళ్లను సందర్శించామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారం కోసం తలపెట్టిన కలెక్టరేట్ వద్ద ధర్నా కార్యక్రమంలో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీప్రసాద్, శివమణి, అఖిల్, రోహిత్, షేక్షావలి, రాజేష్, బాలరాజు, అశోక్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

‘ఉపాధి’ పెండింగ్ బిల్లులు చెల్లించాలి

శింగనమల: ఉపాధి హామీ పథకానికి సంబంధించి ఎనిమిది వారాలు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే కూలీలకు చెల్లించాలని సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు తరిమెల రామాంజనేయులు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని 19 గ్రామ పంచాయతీల్లో దాదాపు 4,500 మంది కూలీలకు రూ. 60 లక్షలు పెండింగ్ బిల్లులున్నాయన్నారు. దీంతో కుటుంబాలు గడవక కూలీలు ఇబ్బంది పడుతున్నారన్నారు. అలాగే కూలీలు వలస పోకుండా పని దినాలు పెంచాలని, రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ ప్రకాష్‌రావుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఓంకార్, సీపీఐ నాయకులు శ్రీరాములు, లక్ష్మీరంగయ్య, నాగరాజు, లక్ష్మీనారాయణ, రవి, నరేష్, నారప్ప, ముని, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు: మండలంలోని ఉపాధి కూలీలకు పెండింగ్ ఉన్న కూలిడబ్బులు చెల్లించాలని సీపీఐ మండల నాయకుడు నారాయణ, మండల కార్యదర్శి వెంకట్రాముడుయాదవ్ కోరారు. సోమవారం ఉపాధి కూలీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రంగనాయకులు, వేణుగోపాల్, కిరణ్, మల్లికార్జున, పోలా రంగస్వామి, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద బీమా చెక్కుల పంపిణీ



చెక్కు పంపిణీ చేస్తున్న దృశ్యం

గుంతకల్లు: ప్రమాదవశాత్తు మృతి చెందిన రైల్వే కార్మికుల కుటుంబసభ్యులకు బీమా చెక్కులు పంపిణీ చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ డైరెక్టర్లు వై.సుధాకర్, వై.సుధాకర్ తెలిపారు. గుత్తి డీజిల్ షెడ్‌లో టెక్నీషియన్-2 పని చేస్తున్న కొత్తపేట లోకేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అలాగే గుంకతల్లు రైల్వే ఆస్పత్రిలో సఫాయివాలుగా పనిచేస్తున్న సుధాకర్ అనారోగ్యంతో మృతి చెందాడు. సోమవారం స్థానిక మజ్దూర్ యూనియన్ కార్యాలయంలో ప్రమాద బీమా చెక్కులను యూనియన్ డివిజన్ ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్ సమక్షంలో లోకేష్ భార్య శ్రీలతకు రూ.5 లక్షలు, సుధాకర్ భార్య లక్ష్మికి రూ.1.62 లక్షల విలువ చేసే చెక్కు అందజేశారు. కార్యక్రమంలో ఏడీఎస్‌లు నారాయణ, మధుసూదన్‌రావు, జోనల్ వర్కింగ్ కమిటీ మెంబర్ శేఖర్‌బాబు, డేలిగేట్లు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ల సీజ్

తాడిపత్రి అర్బన్: అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు టిప్పర్లను సోమవారం సీజ్ చేసినట్లు అర్బన్ సీఐ నాగేంద్ర ప్రసాద్ తెలిపారు. నందలపాడు, హనుమాన్ జంక్షన్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా సజ్జలదిన్నె నుంచి అనంతపురానికి ఇసుకను తరలిస్తుండగా టిప్పర్లను ఆపి తనిఖీ చేశామన్నారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తుండడంతో డ్రైవర్లు రాజకుళ్లాయప్ప, చాకలి వెంకటేష్‌ను అదుపులోకి తీసుకుని టిప్పర్లను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

గడ్డివామి దగ్ధం

యల్లనూరు: మండలంలోని గొడ్డుమర్రి గ్రామంలో రైతు పుల్లయ్య గడ్డివామికి సోమవారం మధ్యాహ్నం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో కాలి బూడిదయింది. తోటలో గడ్డవామితో పాటు పలు సామగ్రి కాలిపోయింది. సమాచారం అందుకున్న తాడిపత్రి అగ్నిమాపక సిబ్బంది వచ్చి ఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పేలోపు గడ్డివామి పూర్తిగా దగ్ధమైంది. పుట్లూరు సీఐ సుబ్రహ్మణ్యం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. రూ.లక్షకు పైగా నష్టం వాటిల్లిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. బాధితుడు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

సంక్షిప్త సమాచారం

‘చెరువులకు నీరు అందించాలి’

గార్లదిన్నె: పీఏబీఆర్ నుంచి చెరువులకు నీరు అందించాలని రాయలసీమ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అక్బర్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ వర్షాలు రాకపోవడంతో 30 శాతం మాత్రమే రైతులు పంటలు సాగు చేశారన్నారు. వర్షాలు లేక భూగర్భజలాలు అడుగంటి పోయాయన్నారు. దీంతో మండలంలో ముకుందాపురం, యర్రగుంట్ల, కోటంక, మర్తాడులో నీరు లేక చీనీ చెట్లు ఎండిపోతున్నాయి. అధికారులు వెంటనే మిడ్ పెన్నార్ డ్యాం నుంచి ఉత్తర, దక్షిణ కాలువలకు నీరు విడుదల చేసి 140 రోజుల పాటు ఆయకట్టుకు నీరు అందించాలన్నారు. చెరువులకు నీరు అందిస్తే ఆయా గ్రామాల్లో వ్యవసాయ బోర్లు రీఛార్జ్ అవుతాయన్నారు.

ఈ– పంట నమోదు చేయించుకోవాలి

గార్లదిన్నె: మండలంలోని వివిధ గ్రామాల్లో 2024 ఖరీఫ్‌లో పంటలు సాగు చేసిన రైతులంతా తప్పనిసరిగా ఈ-పంట నమోదు చేయించుకోవాలని ఏఓ సోమశేఖర్ సూచించారు.సోమవారం ఏఓ మాట్లాడుతూ ఈ ఏడాది నుంచి రైతుల సర్వే నంబర్ ప్రకారం వరుసగా ఈ- పంట నమోదు చేస్తామన్నారు. రైతులు ముందుగా రైతు సేవా కేంద్రాల్లో ఆధార్, పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంకు ఖాతా, 1బీ అందజేసి దరఖాస్తు చేసుకోవాలన్నారు. బుధవారం నుంచి మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఈ-పంట నమోదు చేస్తామన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గుంతకల్లు రూరల్: పంట నమోదు కార్యక్రమం సమర్థవంతంగా నిర్వహించాలని తహసీల్దార్ రమాదేవి సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వ్యవసాయ, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో ఈ- పంట నమోదుపై సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఓ స్వాతి, సిబ్బంది పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

గుంతకల్లు రూరల్: పట్టణ శివారులోని భీమిరెడ్డి కాలనీ సమీపంలో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను ఆదివారం రాత్రి అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.12,500 స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్‌ఐ సురేష్ తెలిపారు. కాలనీ సమీపంలోని ముళ్ల పొదల్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో ఆదివారం అర్ధరాత్రి సమయంలో దాడులు చేసి జూదరులను అదుపులోకి తీసుకున్నామన్నారు.

వ్యక్తిపై దాడి

తాడిపత్రి రూరల్ : మండలంలోని ఆర్టీటీ కాలనీ సమీపంలో ఆదివారం రాత్రి తాజుద్దీన్ అనే వ్యక్తిపై ఇద్దరు రాళ్లతో దాడి చేశారని పోలీసులు తెలిపారు. పుట్లూరు మండలం కోమటికుంట్ల గ్రామానికి చెందిన తాజుద్దీన్ తాడిపత్రి నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంలో వెళుతుండగా ఆర్టీటీ కాలనీ సమీపంలో ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనాల్లో హెల్మెట్లు ధరించి రాళ్ల దాడి చేశారు. స్వల్పంగా గాయపడిన తాజుద్దీన్‌కు చికిత్స నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గుర్తు తెలియని వ్యక్తులు దాడికి దిగారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో తెలిపారు. దాడికి గ్రామంలోని వ్యక్తి గత కక్షలు కారణమై ఉంటాయని పోలీసులు అనుమానిస్తున్నారు.

శివాలయాల్లో ప్రత్యేక పూజలు



బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న కేతిరెడ్డి రమాదేవి

తాడిపత్రి అర్బన్: స్థానిక బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ మాసం మొదటి సోమవారాన్ని పురస్కరించుకుని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సతీమణి కేతిరెడ్డి రమాదేవి సోమవారం ఉదయం పూజలు నిర్వహించారు. స్వామిని దర్శించుకుని ఆమె మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే పట్టణ సమీపంలోని యల్లనూరు రోడ్డులోని గౌరీశంకర దేవాలయం, కడప రోడ్డులోని భ్రమరాంభిక మల్లికార్జున స్వామి తదితర దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

తహసీల్దార్ల బాధ్యతల స్వీకరణ



గుంతకల్లు తహసీల్దార్ రమాదేవి



గుత్తి తహసీల్దార్ ఓబిలేసు



శింగనమల తహసీల్దార్ బ్రహ్మయ్య



గార్లదిన్నె తహసీల్దార్ ఈరమ్మ



బీకేఎస్ తహసీల్దార్ పుణ్యవతి



యల్లనూరు తహసీల్దారు నాగరాజు



పెద్దపప్పూరు తహసీల్దార్ బాలాజీ రాజు

గుంతకల్లు రూరల్/గుత్తి/శింగనమల/గార్లదిన్నె/బుక్కరాయసముద్రం/యల్లనూరు/పెద్దపప్పూరు: గుంతకల్లు మండల తహసీల్దార్‌గా ఎస్. రమాదేవి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో భాగంగా గుంతకల్లు తహసీల్దార్ గా బాధ్యతలు నిర్వహించిన శేషఫణిని తిరిగి అదే జిల్లాకు బదిలీ చేయడంతో ఆయన స్థానంలో సోమవారం బుక్కరాయసముద్రం మండలం నుంచి బదిలీపై వచ్చిన రమాదేవి బాధ్యతలు స్వీకరించారు. అలాగే గుత్తి మండల తహసీల్దార్‌గా హెచ్.ఓబిలేసు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అదేవిధంగా శింగనమల తహసీల్దార్‌గా సాకే.బ్రహ్మయ్య బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఎన్నికల ముందు గుమ్మఘట్ట తహసీల్దార్‌గా పని చేశారు.గార్లదిన్నె తహసీల్దార్‌గా సోమవారం ఈరమ్మ బాధ్యతలు స్వీకరించారు. బుక్కరాయసముద్రం మండల తహసీల్దార్‌గా పుణ్యవతి సోమవారం బాధ్యతలు చేపట్టారు. అనంతపురం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సూపరింటిండెంట్‌గా పనిచేస్తున్న ఆమె బీకేఎస్ తహసీల్దార్‌గా బదిలీపై వచ్చారు. ఎన్నికల విధుల కోసం వచ్చి ఇక్కడ పని చేస్తున్న హనుమంత నాయక్ తిరుపతి జిల్లాకు బదిలీపై వెళ్లారు. అలాగే యల్లనూరు మండల తహసీల్దారుగా నాగరాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో 2016 నుంచి 2018 వరకు విధులు నిర్వర్తించారు. అలాగే పెద్దపప్పూరు తహసీల్దార్‌గా బాలాజీరాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

‘హనుమాన్ దర్శన్’కు ప్రత్యేక బస్సులు

గుంతకల్లుటౌన్: శ్రావణమాసంలో ప్రతి మంగళ, శనివారాల్లో కసాపురం, మురడి, నేమకల్లులో వెలసిన ఆంజనేయస్వామి ఆలయాలను ఒకే రోజు దర్శించడానికి హనుమాన్ దర్శన్ పేరిట గుంతకల్లు ఆర్టీసీ డిపో ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు డిపో మేనేజర్ బాలాజీ దయాళ్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. హనుమాన్ దర్శనానికే వెళ్లే వారు పిల్లలకు రూ.230, పెద్దలకు రూ.430 చొప్పున టిక్కెట్ ధరలను చెల్లించాలన్నారు. అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కేరళ బాధితుల సహాయార్థం విరాళాల సేకరణ

తాడిపత్రి అర్బన్/గుంతకల్లు టౌన్: కేరళలోని వయనాడ్ బాధిత కుటుంబాల సహాయార్థం సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో విరాళాల సేకరణ చేపట్టారు. సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు జగన్‌మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో తాడిపత్రిలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద నుంచి విరాళాల సేకర ణను ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు హనుమంతరెడ్డి, రామ్మోహన్, నాగరాజు, శ్రీరాములు, కుళ్ళాయప్ప, శివ, మహ్మద్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు. అలాగే గుంతకల్లులో నిర్వహించిన విరాళాల సేకరణలో సీపీఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు, ఎస్‌ఎస్‌జీఎస్ డిగ్రీ కాలేజీ మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్‌కే నాయుడు, సీపీఎం నాయకులు మారుతి, రమేష్, సాకేనాగరాజు, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్‌కే.నాయుడు తన వంతు రూ.10 వేలు అందజేశారు.

ఘనంగా తల్లిపాల వారోత్సవాలు

పామిడి: పట్టణంలోని దుర్గమ్మవీధిలో ఉన్న అంగన్‌వాడీ-2 కేంద్రంలో గుత్తి ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సోమవారం తల్లిపాల వారోత్సవ కార్యక్రమం, ఈసీసీఈ డే సమావేశం నిర్వహించారు. హెల్త్ అసిసెంట్లు రవికుమార్, చంద్రశేఖర్‌రెడ్డి, ఏఎన్‌ఎం ఉమాదేవి మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు శ్రీరామరక్ష అన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త, ఆయా, ఆశావర్కర్లు, బాలింతలు, కిశోర బాలికలు, పిల్లలు పాల్గొన్నారు.

తాడిపత్రి రూరల్: మండలంలోని గన్నెవారిపల్లి సచివాలయం పరిధిలో సోమవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుమన్ కుమార్ మాట్లాడుతూ తల్లి పాలు బిడ్డకు ఆరోగ్యమన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ కృష్ణ మోహన్, సిబ్బంది అనురాధ, హేమలత తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు: పుట్టిన బిడ్డకు తల్లి ముర్రు పాలు తాగించడం ఎంతో శ్రేయస్కరమని డాక్టర్ అమర్‌నాథ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి సూచించారు. సోమవారం మండలంలోని కాశేపల్లి, గుత్తిఅనంతపురం గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ సూసర్‌వైజర్ శ్రీనివాసులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు జీవనోపాధులపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి

బుక్కరాయసముద్రం: రైతులు వ్యవసాయంతో పాటు ఆర్థిక జీవనోపాధులపై అవగాహన పెంపొందించుకోవాలని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి సూచించారు. సోమవారం మండలంలోని రెడ్డిపల్లి కేవీకేలో షెడ్యూలు కులాల ఉప ప్రణాళిక (ఎస్సీ ఎస్పీ) పథకంలో భాగంగా జీవనోపాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రైతులకు వ్యవసాయంతో పాటు పెరటి కోళ్ల పెంపకం లాభదాయకంగా ఉంటుందన్నారు. అనంతరం పెరటి కోళ్ల పెంపకంపై కేవీకే పశుపోషణ శాస్త్రవేత్త డాక్టర్ మాధవి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కేవీకే వ్యవసాయ విస్తరణా శాస్త్రవేత్త చందన, నిక్రా-వైపీ-2 ప్రతినిధి ప్రభుమిత్రారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని బాచుపల్లి గ్రామ శివారులో రోడ్డు దాటుతున్న వ్యక్తిని ఆదివారం రాత్రి ఆటో ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల వివరాల మేరకు.. రాయదుర్గానికి చెందిన బాషా బాచుపల్లి శివారులోని బాట సుంకులమ్మ ఆలయం సమీపంలో దాబా వద్దకు వెళ్లేందుకు రోడ్డు దాటుతున్నాడు. అదే సమయంలోగుత్తి వైపు వెళ్తున్న ఆటో వేగంగా అతడిని ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతడిని వెంటనే 108 వాహనం ద్వారా గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం అనంతపురంలోని ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.